# విషం

## అందేగోపాలకృష్ణమూర్తి

'నాన్న మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడు, ఛ !' అనుకొంది జాహ్నవి. 'ముసిలాయనకి మతేం పన్లేదు, ఆడదాని కంటె అధ్వాన్నంగా ఏడవడ మొకటొచ్చు' - మూలుక్కుంటూ మూలనున్న చాపనొకటి లాక్కుని, లోపలి వరండాలో చతికిలబడింది తాయారమ్మగారు, భర్త చేతకానితనాన్ని ఈసడించుకుంటూ.

"నాన్నకి కన్నీళ్ళు నామూలంగానే!" కిటికీ ఊచల వెనకనుంచి, అవతల కుక్కకుర్చీలో కూర్చుని మథనపడుతున్న తండ్రినిచూస్తూ మళ్ళీ అనుకొన్నది జాహ్నవి.

"నాగురించి కన్నీళ్ళు పెట్టుకోకు నాన్నా! దానికిబదులు ఏదైనా ఇంత తెచ్చి, "అమ్మా జాహ్నవీ! దీన్నివిష మంటారు. దీన్నితింటే చక్కగాచచ్చిపోతారు. ఏదీ, గబగబాదీన్ని కళ్ళు మూసుకొని మింగేయ్!" అనంటే ఎంతో సంతోషంగా దాన్ని ఒక్క గుటకలో మింగేసి, నాన్నా, విషం ఎంతో తియ్యగావుంది. ఇంకొంచము ఇవ్వవూ!" అని అడిగేస్తా. ఎంత చేదుగాఉన్నా హాయిగా మింగేస్తా. అంతేగాని మీకన్నీళ్ళు మాత్రంచూడ లేనునాన్నా? అందులోనూ నామూలంగా నువ్వు ఏడవడమా? వద్దునాన్నా వద్దు. నాపెళ్ళి గురించేగా వీబాధ! అవుద్దిలే. ఎలా రాసుంటే అలానే అవుద్ది. నీకేం ఫర్వాలేదు. ఊరుకో నాన్నా! ఊరుకో!" అని, నాన్నపాదాల మీదపడి ఊరడించాలనిపించింది జాహ్నవికి. కాని ధైర్యంలేదు. మనసులోని ఈభావాల్ని మాటల రూపంలో నాన్నకి విప్పించే సాహసం తనకు




లేదు. అందరిలాగా తనూ బియ్యే ప్యాసయినా నాన్నకి ఎదురుబడి మాటకుమాట జవాబుచెప్పే ధైర్యాన్ని తనకు చదువుఇంకా ప్రసాదించలేదు. అందుకే నాన్నంటే ఇంకా తనకు విపరీతమైనభయం. అంతకు మించిన బిడియం_ఈరెంటికీ మించిన గౌరవమూను.

తను బియ్యే చదవడమే ఒకకలలా జరిగిపోయింది. అనుకోకుండా భగవంతుడు మెరిట్ స్కాలర్‌షిప్ ప్రసాదించడంతో ఏఅడ్డంకులూ లేకుండా బ్రహ్మాండంగా పాసయిపోయింది. రిజల్ట్స్ వచ్చినరోజున సుందరీ. సుజాతా. భారతీ వాళ్ళవాళ్ళ ఇళ్ళల్లో ఘనంగా పార్టీలిచ్చారు. ఆపార్టీలో వాళ్ళడేడీలూ. మమ్మీలూ గర్వంగా వాళ్ళమ్మాయిల ప్రయోజకత్వాల గురించి వచ్చినవాళ్ళందరికీ వేయి కంఠాలతో చెప్పుకున్నారు. "యూవి

వర్శిటీకి పంపించి ఎమ్మే చదివిస్తాం" అంటూ ఉబ్బొంగి పోయారు. ఆదృశ్యాలనూ, ఆమాటలను అలానేగుర్తు పెట్టుకున్నతను "నా కంత అదృష్టం కలిగితే నిజంగా ఎంతబావుణ్ణు?" అను కునికలలు కంటుందేవి. తను ప్యాసయిన సంగతివిని "అలాగా! మంచిదే" అనిఆలోచిస్తూ కుక్కికుర్చీలో కూలబడి పోయాడునాన్న. ఆరోజున. ఆరోజు నుండి ఈరోజువరకూ ఆకుక్కి కుర్చీ లోరోజూ కూలబడుతూనే వుంటాడు నాన్న విశ్రాంతి కోసం. కానిఆక్షణాన్నుండే విశ్రాంతిని పూర్తిగా కోల్పోతుంటాడు. దానికి కారణం భూమికి ఇరవైయేళ్ళు ఎదిగినతను! అంతకు ముందే దేవుడునాన్నకి ప్రసాదించిన పేదరికమూను! ఈపేదరికపు బాధా తనిపెళ్ళి బరువూ. ఈరెండే నాన్న నడ్డిని నేలబారుకి వంచి పారేసినయ్. తనపెళ్ళి బరువొక్కటే ఏలాగో ఓలాగవదిల్తే నాన్నఎంతటి పేదరికాన్నైనా, ఎంత ఘోరమైన దరిద్రాన్నైనా అతిసులభంగా భరించేయగలడు. ఔను, ఎలాగైనా ఈబరువును నాన్న నడ్డిమీదనుండీ అమ్మగుండెల మీదనుండీ దింపెయ్యాలి. పాపం అమ్మ! ఎంతటి కష్టాన్నైనా మింగేసి గుండెల్లోనే దాచుకుంటుంది. ఆగుండెలు బరువెక్కి పోయినప్పుడు చింకి చాప సాయంతో కాస్సేపు విశ్రాంతి తీసుకుంటుంది. పట్టుమని నాలుగు మెతుకులైనా ముట్టుకోదు. రోజూ వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటుంది. కనబడిన రాయీ. రప్పా అన్నింటికీ పసుపురాసి కుంకుమ పెడ్తుంది. ఎందుకు? తనమెళ్ళో ఓపసుపు కొమ్ము ఒగిలించేలా ఆ వేయి దేవుళ్ళలోనూ ఒక్క దేవుడైనా కనికరిస్తాడేమోనని!

ఎలా? ఏంచేయాలి? నాన్నకెలా సాయపడాలి? తనకు విద్య పాసయింది గదాఅని ఏదోఉద్యోగం చేస్తానంటే "నసేమిరా వల్లకాదన్నాడు" కూటికికాకపోయినా. కులానికి గొప్పవాడైన నాన్న! అయినా స్నేహితురాలు సుందరి తననెంతో ప్రోత్సహించింది. ఫర్వాలేదన్నది. వాళ్ళనాన్నగారితో చెప్పి ఎక్కడైనా చూస్తానన్నది. పాపం, అలాగే చూసిపెట్టింది. ఏదో ప్రైవేటు ఆఫీసు. డెబ్బైఅయిదు రూపాయలుజీతం. "తప్పకుండా చేరు. మంచి దొబ్బాక మారిపోవచ్చు" నన్చెప్పి, ఎమ్మే చదువుకొందుకు వైజాగ్ వెళ్ళిపోయింది. ఉద్యోగం అనబడే ఆరాంపిలో అడుగుపెట్టిన రెండోరోజునే అక్కడి వెకిలిమనుషుల రంగుల్ని చూడలేక పోయింది. "ఛీ! మానం, అభిమానం ఉన్నదెవరూ ఆచాయలకే పోదు" అనే నిశ్చయంతో స్వస్తి చెప్పింది. "మంచి పనేశావ్!" అన్నాడు నాన్న. తనుచూపిన ఉద్యోగం నచ్చలేదంటే సుందరి ఏమైనాబాధ పడుతుందేమోనని ఇంకాప్రసక్తే తేలేక పోయింది. తర్వాత సుందరి వైజాగ్ నుండి ఉత్తరం రాసింది. ఉద్యోగం బావుందాఅని! ఏమనివ్రాయగలదుతను? మౌనం వహించింది. ఈమౌనాన్ని వేరేవిధంగా అర్థంచేసు

కుని, రెండుకవర్లూ రెండు ఇన్-లాండ్ లెటర్లూ తర్వాతి ఉత్తరంతో కలిపి, వారానికి రెండు ఉత్తరాలు రాయాలి జాహ్నవీ, లేకపోతే నీ జట్టు పచ్చి! అంటూ మురిపించేసింది అబ్బా తనకుకాస్త రిలీఫ్ దొరికేది ఒక్క సుందరి సాంగత్యంలోనే. అంతగొప్పింటిదైనా తనంటే విపరీతమైన అభిమానం, సినిమా అంటే ఏ(వి)టో, కారులో కూర్చుంటే ఎలాగుంటుందో ఇవన్నీ సుందరే రుచిచూపించింది. అందుకే సుందరితో మనసువిప్పి అన్ని విషయాలూ చెప్పేస్తుండేదితను. తన పెళ్ళి విషయమై నాన్నకీ, అమ్మకీ బాధగా వున్నదని కూడా ఆమధ్య చెప్పేస్తే "మంచి ఐడియా చెప్పనా?" అన్నది. తప్పకుండా చెప్పమంటే "ఎవరైనా ప్రేమించేయ్, పెళ్ళిచేసుకోమంటే చేసెయ్యి" అంటూనవ్వేసింది. ఏం(చే)టో అందరూ తనంతటి అదృష్టవంతులు కారని సుందరికి తెలీదు. అబ్బ,సుందరి ఒక్కసారి హఠాత్తుగా కనపడితే ఎంతబావుణ్ణు, ఇప్పుడేం చేస్తుంటుందో! ఏంచేస్తే- తనకుకొత్తగా ఓబాయ్-ఫ్రెండ్ దొరికాడని, అతన్ని గురించి వ్రాసిందిగా! బహుశా అతన్తో ఏ బీచ్ లోనో కూర్చుని హాయిగా హస్కుకొడ్తూ ఉంటుంది. అతను కాలేజీలో బాగా ఏక్టివ్-ఫిగరట. అసలుతనని కొత్తలో అదే పనిగా 'టీజ్' చేసేవాడట. తర్వాత తర్వాత తమాషాగా స్నేహితుడైపోయి, ఇప్పుడు ఒక్క రోజైనా తనతో మాట్లాడకుండా ఉండలేడట. ఎంతో అల్లరి చేసేఅతను. ఔను,అతని పేరే వీటని వ్రాసింది- ఆర్.ఆర్.-గోపాల్- తనెంతచెబితే అంతేనట! అతన్తో మాట్లాడుతుంటే గంటలన్నీ నిముషాల్లా దొర్లి పోతయ్యంట! బహుశ సుందరి అతన్ని ప్రేమిస్తోందేమో! లేకపోతే అతన్ని గురించి అంతలాఎందుకు రాస్తుంది! సుందరిగ వక్క ఒక్క గోపాలేకాదు. వందమంది గోపాల్ లు ప్రేమిస్తారు. సుందరి అందంగా వుంటుంది ధాటించి ఇంగ్లీషులో ఎంతటివాడైనా చిత్తుచేసేస్తుంది. గొప్పింటి పిల్ల చదువుకున్నది. సుందరికింకేం కావాలి? ఎటొచ్చీ తనే! కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్టు తనుఅమ్మకీ, నాన్నకీ-ఇద్దరికేముద్దు. అంతసాధారణ రూపం తనది గొప్పింటి అమ్మాయిలా సొగసూ, ఆడంబరం, హడావుడీ పేదరికపునీడలో పుట్టి పెరుగుతున్న తనకు లేవు. తనకు పేదింటి "నాన్న" ఉన్నాడు. గొప్పింటి "డేడీ" లేడు! గుండెల్లోకి చేరదీసుకొని, కట్టూర్పుల వేదితో జోకొట్టే "అమ్మ" వుంది. పట్టుపరుపు లేర్పాటుచేసి, ఎయిర్-కూలర్ వేసివెళ్ళే "మమ్మీ" లేదు! ఇవన్నీలేవని తెల్సిననాడు ఓగోపాలే కాదు, ఏసుబ్బారావూ తనని ప్రేమించడు అందుచేత సుందరి చెప్పినట్టు ప్రేమించి పెళ్ళిచేసుకునే ప్రసక్తేలేదు. వేలకువేలు కట్నాలు కోరుకునే పెళ్ళికొడుకుని నాన్న కొనితేలేడు. అందుకే తనపెళ్ళి ఓకొరుకు పడనిసమ

న్యగా పరిణమించింది. ఎంతఆలోచించినా పరిష్కార మార్గం కన్పించడం లేదు. ఆదేనాన్నబెంగ! అమ్మబాధాను! అందుకనే ఈడొచ్చిన కూతురుగుండెల మీది కుంపటితో సమాన మంటారు. నాలాంటి పేదింటికూతురు గుండెలమీది గాడిపొయ్యి లాంటిది. గుండెల్నికాల్చి దహించి వేస్తుంది. అమ్మ గుండెలు అవిసిపోతయ్. మాడిమసై పోతయ్. నాన్నగుండెలు ఎండి పోతయ్. కాలి కాలిబూడిదై పోతయ్. ఇదంతాతన మూలాన్నే! తనుబతికున్నమూలాన్నే. అనుకోకుండా చమర్చిన కళ్ళను చీర చెంగుతో ఒత్తుకున్నది జాహ్నవి. అదేపనిగా ఆలోచిస్తున్న జాహ్నవికి మెదడులో ఏదో "తళుక్కు" మని మెరిసి నట్లయింది. "ఔను, తను చచ్చిపోతే! నాన్నకి ప్రోబ్లెంవుండదు. రోజూ కన్నీళ్ళుండవు. ఒక్క రోజే ఆకన్నీళ్ళన్నీ అవగొట్టేసుకుని ఆనక హాయిగా వుంటాడు. నాన్న గుండెలు మెల్లగా చల్లదనాన్ని నింపుకొంటాయ్. నిద్దతిన్న బడ్తుంది. తుక్కు కుర్చీలో నిజంగా విశ్రాంతి గడుపుతాడు. నాన్న హాయిగాఉంటే అమ్మ మూల్గుక్కోదు. చికిదాప జోలకి పోదు. గుండెల్ని బరువుగా నింపుకొనేందుకు అమ్మకి అసలు కష్టాలంటూ ఉండనే ఉండవు. గుండెలమీది గాడిపొయ్యి దిగిపోతుంది. ఆమంటల్లో తనుదహించుకుపోతుంది. నాన్న, అమ్మల సమస్యకు ఇదేపరిష్కారం. ఇదేమంచి సొల్యూషన్. కానీ, చచ్చిపోవడం ఎలా? ఔను, ఎలా? ఎలాగైనాసరే, చచ్చిపోయి తీరాలి!" కళ్ళొత్తుకొని, నాన్న వైపుచూసింది జాహ్నవి. 'నాన్న' కూడ కళ్ళొత్తుకుని, కండువా భుజాన్ని సర్దుకొని, బయటకు బయల్దేరుతుంటే "పోనీ ఆ బైట స్నేహితులతోనైనా కాస్సేపుంటే నాన్నకి కన్నీరుకొంత తగ్గుతుంది." అనుకొంది జాహ్నవి!

* * *

అడుగులో అడుగు వేసుకొంటూ జాగ్రత్తగా నడుస్తున్నాడు రామనాథం. నడకకంటె హెచ్చుగా ఆలోచిస్తున్నాడాయన. "ఔను, అదొక్కటే తనకు గత్యంతరం. అంతకుమించి వేరేఏమీ తను చెయ్యేడు. పదిహేను రోజుల క్రితం ఏదో సంబంధం వచ్చింది. అబ్బాయి బియ్యేబియ్యేడి హైస్కూల్లో మాస్టరు. అన్నీచూసుకుని జవాబు వ్రాస్తామని వెళ్ళిపోయారు. రెండువారాలైంది. రోజూ జవాబు కోసం వెయ్యికళ్ళతో ఎదురుచూసేవాడుతను. ఎదురుచూసి, చూసి కళ్ళు కాయలు కాసినై! ఆకాయలు పళ్ళయి, డాగులుపడి కుళ్ళిపోయి, కన్నీళ్ళలా రాలిపోయినై! అసలుతనకి కన్నీళ్ళు ఇలాగనే వస్తుంటాయ్ గాబోలు. అందుకే కన్నీళ్ళుకారే ఈకళ్ళు మూసుకుపోతేఇక ఏబాధా ఉండదు. జాహ్నవికి ఓవిధాన తను పెద్ద అడ్డు. లేకపోతే దానికేం? బియ్యే ప్యాసయింది. ఏగుమస్తాగాడో దాన్ని చేసుకోకపోడు దాని బతుకు అదిబతికేయ గలదు.

ఎటొచ్చిపెద్ద దిక్కంటూ తనుండబట్టి అదిదేనికీ తెగించలేక పోతోంది. ఇక ముసలావిడకా, తనున్నా లేకపోయినా ఒక చే: ఉండిఉద్ధరించగల్గేది వీస మైనాలేదు. తనుకన్ను మూసినరోజున నాలుగు కన్నీళ్ళుకార్చి మర్చిపోతారు. అప్పుడు జాహ్నవి తప్పనిసరిగా ఏదో ఉద్యోగంలో చేరి తీరుతుంది. దేవుడిచ్చిన తెలివితేట లున్నాయి గనుక జాగ్రత్తగా మసలుకొని ఎవరో ఒకాణ్ని చేసుకుంటుంది. దాన్నెవడూ మోసం మాత్రం చేయలేడు. తనుబతికుంటే ఆసాహసం కూడాఅది చెయ్యలేదు, అందుచేత చచ్చిపోవాలి, ధైర్యంగా చచ్చిపోవాలి. నిజంగాచచ్చిపోవాలి. కాళ్ళు "పంతులుగారి మందులకొట్టు" కేసినడిచినయ్.

• • •

"రండిరండి మాష్టారూ!" అంటూ లేచి ఆహ్వానించి, కుర్చీ చూపెట్టాడు 'పంతులుగారు.' రామనాధాన్ని అల్లంతదూరాన చూడగానే.

"ఏం నాయనా, వ్యాపారం బావుందా?" అన్నాడు రామనాధం కుర్చీలో కూలబడుతూ.

"మీదయవల్ల అంతా సవ్యంగానే ఉంది. తమకిఒంట్లో ఆరోగ్యంగా వుందికదా!" అప్యాయంగా అడిగాడు పంతులుగారు.

"ఏమారోగ్యం. అంతా భగవంతుడిదయ. ఎప్పుడు అర్డరిస్తే అప్పుడు వెళ్ళిపోడానిక్కి సిద్ధంగా ఉన్నానాయనా! సరేగాని, నిద్రపట్టక ఛస్తున్నా ననుకో, ఏదైనా ఇంత మందిప్పించు."

"దానికేం భాగ్యం మాస్టారూ! చిన్నమాత్ర ఇస్తాను, దాన్ని రెండు ముక్కలు చేసి, ఓముక్క ఈవేళ, మరోసారి మరొకటి వేసుకోండి. అసలీమాత్రల్ని డాక్టరు చీటీలేందే ఇవ్వకూడ దనుకోండి. ఒకటీ.అరా ఫర్వాలేదు. అందులోనూ మీరడిగితే ఎలా లేదంటానూ?" అంటూ రామనాధం కుర్చీకి కుడివైపునున్న అద్దాలబీరువాను తెరచి, ఓ సీసా తీసి, "ఒక్క మాత్ర"మాత్రం బైటకుతీసి, సీసాను యధాస్థానంలో పదిలపర్చాడు. "జాగ్రత్త మాష్టారూ. ఒక్కొక్క ముక్కే వేసుకోండి కానీ ఎందుకైనా మంచిది, పెద్దవారుగదా!" అంటూతనే మాత్రనురెండు ముక్కలు చేసి, కాగితంలో పొట్లంకడుతూ రామనాధం చేతికిచ్చేడు.

"అలాంటివి సీసాడు మ్రింగినా నాప్రాణం పోదునాయనా! నీకా భయమక్కర్లేదు. 'పాపీ చిరాయు' వన్నారు, నాలాటివాడికా దేవుడు అంతటి అదృష్టాన్ని ప్రసాదిస్తాడా!"

కంటతడి పెట్టుకొన్న రామనాధాన్ని చూస్తూ, "ఛఛ,అవేం మాటలు మాస్టారూ! మేమంతా మీకులేమూ? పెద్దవారు, మీరే అలా డీలాపడిపోతె అన్నెంపున్నెం ఎరుగని మేమేమైపోవాలి! కాస్త కాఫీ తీసుకుంటారా! ఒక్కనిముషం కూర్చోండి, ఎదురుగా

ఉన్నహోటల్లో చెప్పేసొస్తా. కుర్రాడు పార్శిలు విడిపించడానికి మధ్యాన్నం అనగా వెళ్ళి. తిరిగిరాలేదు! అని, బైట కునడిచాడు.

ఒక్కసారి చుట్టూకలయ జూశాడు రామనాధం. ఎవరూలేరు. రోడ్డుమీద జనం ఎవరిధ్యాసలో వాళ్ళున్నారు. ఎదురుగావున్న వేంకటేశ్వరుడి పఠం చూసి "జీవితంలో ఎప్పుడూ దొంగ తనం చేయలేదు, ఈ ఒక్క అపచా రాన్నీ మన్నించు భగవాన్!" అని కళ్ళుమూసుకొని, కుడిచేతి వైపున్న అద్దాలబీరువా తలుపు తెరిచాడు. కంపించిపోతున్న చేతులను స్వాధీనం లోకి తెచ్చుకుంటూ ఇందాకటి మాత్రల "సీసా"ను ఒక్కఉదటున అందుకొని పాతకోటు లోపలి జేబులో జాగ్రత్త చేసేసు, అద్దాలబీరువా తలుపులను జాగ్రత్తగా మూసివేసి, గొడుగు కర్ర మీదతలఆన్చి, ఏదో ఆలోచిస్తున్న వాడిలా కూర్చుండి పోయాడు.

రెండు నిముషాల్లో కాఫీపట్టించు కొచ్చాడు పంతులుగారు. ఎందుకు నాయనా ఈశ్రమ అంటూనే "పంతులు"చేతి కందించిన కప్పు అందు కున్నాడు రామనాధం.

"శ్రమేవుంది మాస్టారూ! మీలాటి పెద్దల చలవేగదా ఇదంతాను! మాఅబ్బాయి డాక్టరుచదువుతున్నాడంటే చిన్నప్పుడు మీరువేసిన పునాదేకదా! వాడెప్పుడొచ్చినా మీగురించి అడుగుతూనేవుంటాడు. మీ కొక్కవల్సిన మందులన్నీ ఊరికే ఇమ్మంటుంటాడు. అలాగని మీకు మందుల అవసరం రావాలనినేను కోరుకోనను కోండీ! ఏం? బాగావేడిగా వుందా? చల్లారబెట్టి ఇమ్మంటారా?.." ప్రక్కనున్న కూజా తాలూకు గాజుగ్లాసుని అందుకొని రామనాధం కాఫీని తిరగబోసి, మళ్ళీ చేతికందించాడు పంతులుగారు. ఆప్యాయంగా కాఫీని పూర్తిచేశాడు రామనాధం. రెండుమూడు నిముషాలు గడిచాక "వస్తాన్నాయనా" అంటూలేచాడు రామనాధం. "మంచిది మాష్టారూ, దయుంచండి!" అంటూ నమస్కారం పెట్టాడు పంతులుగారు.

* * *

కన్నీళ్ళొత్తుకుంటూ షస్తారను కొన్ననాన్న అదోలాంటి కొత్తధోరణిలో ఉషారుగా తిరిగొచ్చేసరికి "ఏదైనా సంబంధం ఖాయమైంది" గామోసునని అనుమానపడింది జాహ్నవి. కానీ, వచ్చిన పావుగంట వరకూ కూడాఏమీ మాట్లాడక పోయేసరికి "అటువంటి దేవీ ఉండి ఉండదులే. బైటెవరైనా స్నేహితుడేదైనా ఆశ చూపేదేమో" ననుకొని, తాత్కాలికమైన ఆమార్పు "తండ్రిలో" ఎప్పుడూ వుండిపోతే బావుణ్ణను కొని సంబరపడి, "వడ్డించేయమంటావానాన్నా?" అన్నది ఆప్యాయంగా,

"అహ్మేం చేస్తుందమ్మా?" అన్నాడు రామనాధం.

"ఆయాసంగా ఉందిట. గుండెల్లో ఏదో బరువట గుండెదడఅట".

తోంచెయ్యాలని పడుకుంది..."

"దాని కీనాకూ గుండెదిరువు లేని దెప్పుడూ!.." అంటూ వరండాలోకి దారితీశాడు రామనాథం, లుంగీ సర్దుకుంటూ.

"అదంతా నాబరువేగా!"- మనసులోనే మూలుక్కున్నది జాహ్నవి.

కాళ్ళు చేతులూ కడుక్కొచ్చి, తుడుచుకొంటూ, తుండుగుడ్డ భుజాన్నేసుకొని, కోటుజేబు లోంచి మాత్రల సీసాతీసి దేవుడి పటం వెనుకపెట్టే ప్రయత్నం చేయబోయిన రామనాథం "...దంచేసేన్నాన్నా!" అంటూ వచ్చిన జాహ్నవిని చూస్తూనే తడబడిపోయాడు.

"నాన్న"లో ఎప్పుడూలేని కొత్త రకం కలవరపాటుని చూసి విస్తుపోయింది. జాహ్నవి. "వస్తున్నాను వ్వేళ్ళు!" అన్నాడు రామనాథం ఏదో తప్పుచేస్తున్న వాడిలా ముఖంపెట్టి.

అడుగులో అడుగు వేసుకుంటూ వెనక్కివచ్చి గుమ్మం చాటునపల్చిపోయింది జాహ్నవి. "నాన్న" దేన్నో "దేవుడి అల్మారా"లో పదిల పర్చడం, దానితాళంతీసి కోటుజేబులో వేసుకోవడం అన్నీ గమనించి, ఏమీ తెలియనట్టు వెనక్కు తగ్గిపోయింది జాహ్నవి.

"వడ్డించేసే వామ్మా!" అమృత వర్షాన్ని కురిపిస్తున్నట్టుగా వచ్చిభోజనంముందు కూర్చున్నాడు రామనాథం.

నాన్నకి మంచినీళ్ళవీ పెట్టి, ఏదో పనున్నట్టు మెల్లగా బైటి గదిలోకి వచ్చింది. కోటుజేబులో తాళం తీసి అల్మారావిప్పింది. జాహ్నవి. దేవుడి-పటం వెనుక నుంచి చిన్న సీసా బైటకు తీసి పరీక్షగా చూసింది. "అమ్మో, నిద్రమాత్రలు! పాతికదాకా వున్నయ్! నాన్న వీటిని ఎందుకు తెచ్చినట్టు? ఎక్కణ్ణుంచి తెచ్చినట్టు? ఒకవేళ తనను సులభంగా చచ్చిపొమ్మని దేవుడే నాన్నచేత వీటిని పంపించేడేమో! లేకపోతే అసలివి నాన్న కెందుకు? నిద్రపట్టక రోజుకొకటి వేసుకొందామని తెచ్చుకున్నాడేమో! లేకపోతే తన కొచ్చిన ఐడియాయే నాన్నక్కూడా వచ్చిందా కొంపదీసి! బాబోయ్, నాన్న చచ్చిపోవడమే! అమ్మేమైపోతుంది! తను లేకపోయినా ఉండగలదు కాని, నాన్న లేకపోతే అమ్మ బతగ్గలదా? నాన్నే గనక లేకపోతే ఇంటికి మగదిక్కెవరూ? ఇంకేమైనా ఉందా! దీన్ని తన కోసమే దేవుడు పంపించేడు. చావడానికి ఇంతకంటె హాయి అన్పించే మార్గం మరొకటి లేదు. ఇదంతా దేవుడి మాయ! లేకపోతే ఇందాక చచ్చిపోదా మనుకోవడమేమిటి, దాని కనుకూలంగా అప్పుడే ఈమందు నాన్న తేవడమేమిటి! దేవుడా. నిజంగా నేనెంత అదృష్టవంతురాల్ని! ఇన్నాళ్ళకు నా మీద దయ కల్గిందా నీకు!"

"అమ్మాయ్!" ఫోంచేస్తున్న 'నాన్న' కంఠంవిని కంగారుగా సీసాను బొడ్లో దోపుకుని, తాళం వేసేసి, దాన్ని కోటుజేబులో పడేసి, పరుగెత్తుకుంటూ వచ్చి "ఏం కావాలి నాన్నా?" అంటూ వడ్డనలో మునిగిపోయింది జాహ్నవి.

"అమ్మనులేచి ఫోంచెయ్యమను."

"గుండెల్లో దడగా వుందట...."

"రేపొద్దున కన్నీ తగ్గుతయ్. నాలుగు మెతుకులు ఎంగిలిపడి లెమ్మను!" అంటూ చెయ్యికడుక్కొని వీధిగదిలో కెళ్ళిపోయాడు రామనాథం.

"ఔను, నిజమే నాన్నా! రేపొద్దున కన్ని బాధలూ, అన్నిబరువులూ తగ్గిపోతయ్!" మనసులోనే రేపటి దృశ్యాన్ని ఊహించుకుంటూ కళ్ళు పిండుకొన్నది జాహ్నవి.

* * *

గడియారం రాత్రి పది కొట్టింది. వీధి వరండాలో నడుం వాల్చాడు రామనాథం. "అమ్మాయ్!" అని పిల్చేడు. జవాబు రాలేదు. మళ్ళీ పిల్చాడు. జవాబులేదు. 'పిచ్చిపిల్ల, సుఖంగా నిద్దరోతుంది! ఈ పిలుపు మళ్ళీ మళ్ళీ విన్పించదని దానికి తెలీదు!' అనుకొని కళ్ళు తుడుచుకొన్నాడు.

నాన్న పిలుపు విన్పించింది, కన్నీరు కారుస్తూ కూర్చుని ఆలోచిస్తున్న జాహ్నవికి. కాని కావాలనే బదులు చెప్పలేదు. నిద్రపోయేననుకొని తన పని తాను చూసుకుంటాడు. రేపటి నుంచి నాన్న పిలుపుకి తనవద్దనుంచి జవాబుండనేఉండదని పాపం నాన్నకేం తెల్సు! ఒక్క రోజు తన కోసం ఏడ్చినా, తర్వాత్తర్వాత నాన్న కెంతో తేలిగ్గా ఉంటుంది తన చావు. మెల్లగా లేచి చెవులకున్న దుద్దులుతీసి 'అమ్మ' పెట్లో పెట్టింది. కుడిచేతికున్న బంగారు గాజుని తీసి కళ్ళ కద్దుకుని దుద్దులకు జతచేసి, పెట్టెమూత జాగ్రత్తగా వేసింది. 'నాన్న పడుకున్నాక నాన్న పాదాలకు నమస్కారం పెట్టి, తర్వాత అమ్మ పాదాల్ని కళ్ళ కద్దుకుని, తర్వాత....సామాను గదిలో తలుపులు బిగించుకొని, నిద్ర మాత్రలన్నీ ఒక్క గుటకలో మ్రింగేసి....హాయిగా చచ్చిపోవాలి!!' అనుకొని ఓపిగ్గా పది నిముషాలు గడిపింది.

మెల్లగా పక్కమీద నుంచి లేవబోయిన రామనాథం కూతురి అడుగుల చప్పుడు విని అలాగే పడుకుండిపోయాడు. 'ఎందుకిటు వస్తుంది!' ఆశ్చర్యంతో ఆ చీకటిని చించుకొంటూ చూడసాగేడు.

"నాన్నా!" అన్నది మెల్లగా జాహ్నవి.

కావాలనే నోరు మెదపలేదు 'నాన్న'. "నిద్రపోతున్నావా నాన్నా!" కొంచెం గట్టిగానే అన్నది బొంగురుపోయిన కంఠంతో. మారు మాట్లాడలేదు రామనాథం, 'జాహ్నవి వెళ్ళి పడుకుంటేనే గాని తన ప్రయత్నం నెరవేరదు. ఇప్పుడు పలికితే ఇది ఒక పట్టాన వెళ్ళదు. ఎందుకో ఏడుస్తూ కూర్చుం

ఉంది' అనుకొని మౌనం వహించేడు రామనాధం.

నాన్న కాళ్ళకి దణ్ణం పెట్టి, కళ్ళ ద్దుకుని లోపలి కెళ్ళిపోయింది జాహ్నవి. 'పిచ్చిపిల్ల! నిద్రలో మెలుకువ వచ్చింది గామోసు. ఏ పీకలు వచ్చిందో, ఏవో!' అనుకుంటూ మరో అయిదు నిముషాలు గడిపాడు రామనాధం.

'అమ్మ' పాదాలకి నమస్కారం పెట్టి "అమ్మా, నన్ను క్షమించు. నీ కడుపున పుట్టి నీకు లెక్కలేనన్ని కష్టాలు తెచ్చిపెట్టేను. ఇంకెప్పుడూ నీ కడుపున పుట్టనమ్మా! ఈ సారికి క్షమించు!" మనసులోనే అనుకొంటూ తల్లి పాదాల్లోని చల్లదనంతో కళ్ళొత్తుకున్నది జాహ్నవి. కొత్తగా అన్పించిన ఆ చల్లదనాన్కి ఒక్క క్షణం విస్తుపోయి 'అమ్మా!' అంటూ పాదాలు పట్టుకొని కుదిపింది. ఒక్క అంగలో ముందుకొచ్చి 'అమ్మా, అమ్మా!' అని గుండెలు పట్టుకుని కుదిపేసింది. మరుక్షణం—

"నాన్నా! అమ్మ చచ్చిపోయింది!" వెయ్యి కంఠాలతో చీలిచి చీలుస్తూ ఒకే అరుపు అరిచి కుప్పగా కూలి పోయింది జాహ్నవి.

"ఏమైంది, ఏమైంది .... తల్లీ .... ఏమైంది....నే తెచ్చిన నిద్రమందు ఏదీ?....అది అమ్మ తినేసిందా.... తల్లీ—జాహ్నవీ! .... ఏమైందమ్మా! అది నా కోసం తెచ్చుకున్నా... అమ్మ మింగేసిందా! జాహ్నవీ—" రామనాధం కంపించిపోతూ ఓ చేత్తో జాహ్నవినీ, మరో చేత్తో భార్యనూ కుదిపివేశాడు.

"నాన్నా నేను చచ్చిపోదామనుకుంటే అమ్మ చచ్చిపోయింది. నేను బతకను, నేనూ చచ్చిపోతాను. ఇదిగో నా దగ్గిర విషం ఉంది. నేను మింగేస్తా—" పిచ్చగా అరుస్తూ 'నిద్ర మాత్రల సీసా' బైటకు తీసింది జాహ్నవి.

"ఇది నీకెలా వచ్చింది తల్లీ, ఎందుకు తీసేవ్. అమ్మెలా చచ్చి పోయింది .... అయ్యో.... దేవుడా.... నన్నింకా ఎందుకు చేవ్...." జాహ్నవి చేతిలో సీసాను బలంగా లాక్కుంటూ కుమిలి పోయాడు రామనాధం.

"దీన్ని నా కోసం తెచ్చుకున్నా. అమ్మెలా పోయింది...." చిన్న పిల్లాడిలా ఏడువ ప్రారంభించాడు.

"నామూలంగానే నాన్నా-నామూలంగానే! విషంకంటె ఘోరమైన కాలకూట విషాన్ని-నామూలంగానే నాన్నా అమ్మ చచ్చిపోయింది. నామూలంగానే అమ్మకి గుండెల్లో బరువూ, బాధా, నొప్పి అన్నీను-నాన్నా, నూ చచ్చిపోతాను, అమ్మా, నన్నూ తీసుకుపో!" తల్లి మీద పడి బావురుమన్నది జాహ్నవి.

తన ప్రమేయమేమీ లేదన్నట్టుగా, వణుకుతున్న రామనాధం చేతిలోంచి జారిపోయి, భోరుమని ఏడుస్తున్న జాహ్నవి ప్రక్కనుండి దొర్లుకుంటూ ఎటో పోయింది విషం మాత్రల సీసా!

●●●